# స్థిరీకరణకు అవకాశం




**సమీక్ష:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) తమ కొనుగోలు ధోరణిని కొనసాగించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లు అనుకూలంగా ఉండడంతో మార్కెట్ ర్యాలీ కొనసాగింది. 32 నెలల గరిష్ఠాన్ని చేరడంతో పాటు వారం మొత్తం మీద 795 పాయింట్ల భారీ లాభాన్ని పొందింది. 19595 వద్ద ముగిసింది. సెన్సెక్స్ బలహీనంగా ప్రారంభమయినా తర్వాత ఎఫ్ఐఐల పెట్టుబడులు, అధిక ముందస్తు పన్ను చెల్లింపులు, తగ్గిన ద్రవ్యోల్బణం కారణాలతో క్రమంగా పెరుగుతూ పోయింది. వారం మధ్యలో లాభాల స్వీకరణ కారణంగా కాస్త నెమ్మదించినా మధ్యంతర త్రైమాసిక సమీక్ష ఆర్ బీఐ ఊహించినట్లుగానే రేట్లు పెంచడంతో మళ్లీ జోరందుకుంది.

**ఎఫ్ఐఐల తీరు:** గతవారం ఎఫ్ఐఐలు భారీ స్థాయిలో రూ.9040 కోట్ల నికర కొనుగోళ్లు చేయడం విశేషం. మ్యూచువల్ ఫండ్లు మాత్రం రూ.2622 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** కీలక రేట్ల పెంపు అంచనాలకు అనుగుణంగా ఉండడంతో బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. అంతక్రితం ర్యాలీలో పాల్గొనకపోవడంతో చమురు-సహజవాయువు, స్థిరాస్తి రంగాలూ అధికంగానే లాభపడ్డాయి. మరో పక్క విద్యుత్, వాహన, లోహ సూచీలు డీలా పడ్డాయి. ఎఫ్ఐఐల కొనుగోళ్లతో ప్రధాన షేర్లు ఓ వెలుగు వెలగ్గా.. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్‌లు ఓ మోస్తరుగా రాణించాయి. వారాంతానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:3గా నమోదవడం చూస్తే ఎంపిక చేసిన స్క్రిప్‌లలో లాభాల స్వీకరణ జరిగినట్లు తెలుస్తోంది.

**భవిష్యత్ అంచనాలు:** వరుస మూడు వారాల తర్వాత సెన్సెక్స్ 19000 స్థాయిపైకి దూసుకెళ్లింది. మధ్యకాలానికి మరింత ర్యాలీ ఉంటుందని ఇది సూచిస్తోంది. ఆల్‌టైం గరిష్ఠమైన 21200 పాయింట్లకు తిరిగి చేరే అవకాశానికీ ఇది సంకేతాలనిస్తోంది. ఒక వేళ 18931 స్థాయి కంటే దిగువకు సెన్సెక్స్ చేరితే స్వల్పకాలంలో దిద్దుబాటుకు గురికావచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** ముందస్తు పన్ను గణాంకాలు అంచనాలను మించడంతో రాబోయే త్రైమాసిక ఫలితాలపై ఆశాభావంతో మదుపర్లు పొజిషన్లను పెంచుకునే అవకాశాలు ఉన్నాయి. ద్రవ్యోల్బణంమరింత తగ్గితే వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే రంగాల స్క్రిప్‌లపై మార్కెట్ ఆసక్తి కొనసాగగలదు. మూడు నెలల కొత్త గరిష్ఠాన్ని (45.83) తాకిన రూపాయి మారకపు విలువ మరింత బలపడితే ఎగుమతి ఆధారిత స్క్రిప్‌లు బలహీనపడే అవకాశం ఉంది. శుక్రవారం(24న) వెలువడనున్న అయోధ్యపై కోర్టు తీర్పు ఫలితాన్ని; 21న అమెరికా ఫెడ్ రిజర్వు పరపతి సమావేశ నిర్ణయాన్నీ మార్కెట్ పరిశీలించనుంది.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 19000, 19218, 19383; **తక్షణ నిరోధ స్థాయిలు:** 19897, 20031, 20238

**గత కొద్ది రోజులుగా మార్కెట్ వేగంగా లాభాలు పొందిన తీరు గమనిస్తే ఏదైనా దిశ తీసుకోవడానికి ముందు స్థిరీకరణ జరిగే అవకాశం ఉంది.**

*– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*